# గనులను జాతీయం చేస్తే -- అమ్మో ఎంతమాట!

2010 అక్టోబర్ **వీక్షణం** లో వచ్చింది

ఇనుప ఖనిజం, గ్రానైట్ గనులతోపాటు ఇసుక తవ్వకాన్నీ జాతీయం చేస్తే రాష్ట్రానికి ఉన్న రూ.18,300 కోట్ల బకాయిలను 15 రోజుల్లో చెల్లించవచ్చు.రాష్ట్ర ప్రభుత్వం ఒక్క హెలికాప్టర్ కొనాలంటే నిధుల సమీకరణ కోసం ఏడాదిపాటు తర్జన భర్జన పడాల్సివస్తోంది. ఒక్కో గని యజమాని వద్ద 3 హెలికాప్టర్లు ఉన్నాయి

----- ఆదాల ప్రభాకరరెడ్డి

గనులను జాతీయం చేస్తే ప్రజలకు రెండుపూటలా నేరుగా క్యారీయర్లే ఇంటికి పంపొచ్చు

----- జె.సి.దివాకరరెడ్డి

మే 24 ఉదయం సి.ఎల్.పి కార్యాలయంలో ఈఇద్దరు మాజీమంత్రులు చెసిన వ్యాఖ్యలివి. ఆ మర్రోజు 25న ఆంధ్రజ్యోతి 8 వ పెజీలో వార్త ప్రచురించింది.

ఎందుకు చెప్పారోగాని పాలకులకి చికాకూ చిక్కూ కలిగించేదే.

వీళ్ళు చెప్పింది మనరాష్ట్రం గురించే.

మైనింగ్ కోసం అటవీ ప్రాంతాల్ని ఎక్కువగా ఇచ్చిన రాష్ట్రం చత్తీస్ఘడ్ అయితే ఆంధ్రప్రదేశ్ ది రెండో స్థానం. వ్యవసాయేతర కార్యాలకు 5 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూముల్ని మళ్ళించింది. అలాగని కేంద్ర గ్రామీణాభి వృద్ధి శాఖ చెప్పింది. బాక్సైట్ తవ్వకాలను విశాఖమన్యంలో జిందాల్ కంపెనీ కీ. విశాఖ ఏజెన్సీలో రస్ అల్ ఖైమా సంస్థ కీ ప్రభుత్వం అప్పగించింది

అనిల్ కుమార్కు ఖమ్మం జిల్లా లో 1లక్ష 37 వేల ఎకరాల భూమి ఏకంగా ప్రభుత్వం సంతర్పణ చేసింది. 13 లక్షల కోట్ల రూపాయల విలుచేసే ఖనిజం లభిస్తుందని అంచనా..రెండో కంటికి తెలియకుండా ఫయిళ్ళు నడిపి చట్టాలని తుంగలోతొక్కి ఆఘమేఘాలమీద అప్పగించింది ప్రభుత్వం. ఇదిదేశంలోకెల్లా అతి పెద్ద కుంభకోణం. టాటాలు, బిర్లాలు వంటి వారికి కూడా ఇంత విస్తీర్ణంలో ఖనిజ నిక్షేపాలు లేవు.

ఓబుళాపురంలో జనార్ధనరెడ్డికి ఇచ్చిన గనుల విస్తీర్ణం 235 ఎకరాలు. బయ్యారం సంతర్పణ దీనికి ఇంచుమించు 600 రెట్లు. ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. దొడ్డిదారిన ధారాదత్తం చేసి రాచమార్గం ఏర్పరిచే కృషి చేస్తున్నది. అయిదా రేళ్ళనుంచి రోజు 100 లారీలకి పైగా తరలించుకు పోతున్నారు. అక్కడ 62 శాతం ఇనుము ఉందని ఏ.పి.ఎం.డి.సి చెప్పింది. అక్కడున్నది ఓబులాపురం కంటే నాణ్యమయిన ఖనిజం.

ఇక ఓబుళాపురం మైనింగ్ కంపనీ గురించి జరుగుతున్న గలభా అంతాఇంతా కాదు. దానికి అధిపతులు గాలి సోదరులు. గాలి జనార్ధనరెడ్డి టూరిజం మంత్రి. ఆయన అన్న కరుణాకరరెడ్డి రెవిన్యూ మంత్రి.వీళ్ళ తమ్ముడు అసెంబ్లీ సభ్యుడు.కర్నాటక పాల సొసైటికి అధ్యక్షుడు. ఇంకేం కావలి. ఏమైనాఅ చెయ్యటానికి వెనకాడలేదు కర్ణాటకలో 2009-10 సంవత్సరంలో 71 లక్షల టన్నుల ఇనుం అక్రమంగా ఎగుమతయిందని జులై 9 న ముఖ్యమంత్రి అసెంబ్లీలో చెప్పాడు.బి.జె.పి. అధికారంలో కొచ్చిన మొదటి సంవత్సరం 2008-09 లో 33 లక్షల టన్నులు.2003-04 లో 20 లక్షల టన్నులూ,2004-05 లో 52 లక్షల టన్నులూ,2005-06 లో21 లక్షల

టన్నులూ, 2006-07 లో47 లక్షల టన్నులూ, 2007-08 లో 57 లక్షల టన్నులూ అక్రమంగా తరలిపోయాయి.

ఓబులాపురం మైనింగ్ కంపెనీ కర్నాటక ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దు గుర్తుల్ని చెరిపివేసింది.అక్రమ తవ్వకం ఇటువైపా అటువైపా అనేదితేల్చటం కష్టమయ్యేట్లు చేసింది. గాలి కంపెనీ సరిహద్దుల్ని మార్చి వేసిందని 2008 లో లోకాయుక్త నివేదిక తేల్చింది. జనార్దనరెడ్డి తాను తవ్వుకుంటున్నది ఆంధ్ర ప్రదేశ్ లోనేననీ, కర్ణాటకలో కాదనీ చెప్పాడు. మైనింగ్ మాఫియాపై ప్రభుత్వం చర్య తీసుకోవడం లేదని ఆ రాష్ట్ర లోకాయుక్త సంతోష్ హెగ్డే రాజీనామా చేసి తర్వాత సర్దుకున్నాడు. సుప్రిం కోర్ట్ ఆర్డర్ మేరకు సర్వే ఆఫ్ ఇండియా సంస్థ హద్దులు తేల్చే పనిలో ఉంది.

యెడ్యూరప్ప వాళ్ళకి కళ్ళెమేసే స్తితిలో లేడు.ఆయన ఆర్.ఎస్.ఎస్ లో15 ఏళ్ళు పనిచేశాడు.జనసంఘ్, బి.జె.పి పార్టిలలో 38 ఏళ్ళు గడిపాడు.పార్టి అధిష్ఠానం అదంతా పక్కన బెట్టింది. మైనింగ్ మాగ్నెట్స్ కే వంత పాడింది. అక్కడ వాళ్ళకున్న పట్టు అది. పార్టిలో ఎంతకాలం ఉన్నా పోయినేడు టి.వి ముందూ, పోయిన నెలలో ఒక బహిరంగ సభలో ఏడవటం తప్ప ఏమీ  చెయ్యలేకపోయాడు. రెండోసారి సుష్మా స్వరాజ్ సమక్షంలో.ఆమెని గాలి సోదరులు అమ్మ అంటారు. యెడ్యూరప్ప తలవంచాడు. లారీకి 1000 రూపాయల రుసుం చెల్లించ మనగానే గాలి సోదరులు తిరగబడ్డారు. ముఖ్యమంత్రికి ఎసరుపెట్టారు. ముఖ్యమంత్రిని ఏడ్చేట్లు ఒత్తిడి పెట్టారు. యెడ్యూరప్పని దారికి తెచ్చుకున్నారు. సిబిఐ చేత దర్యాప్తు జరిపించాలని కర్ణాటక అసెంబ్లీలో చేసిన డిమాండ్‌ను ఎడ్యూరప్ప తిరస్కరిం చాడు. ఇప్పుడేమో అక్రమాలు జరిగిన ఆనవాళ్ళే లేవని కితాబిచ్చాడు. సాక్ష్యాలుంటే ప్రతిపక్షాలు కోర్టుకు పోవచ్చన్నాడు గాలి సోదరులు 27 లక్షల టన్నుల ఇనుపఖనిజాన్ని కొల్లగొట్టారని ఒక ఎన్.జి.ఒ సంస్త లెక్కగట్టింది. కర్ణాటకనుంచి 35 లక్షల టన్నుల ఇనుప ఖనిజం అక్రమంగా ఎగుమతి అయిందని పోయిన వారం అసెంబ్లీలో చెప్పిన యెడ్యూరప్ప, అదే నోటితో అసలు అక్రమ తవ్వకాలు జరిగిన దాఖలాలే లేవు పొమ్మన్నాడు. దీన్నిబట్టి ఆనాడాయన కార్చిన కన్నీళ్ళు మొసలి కన్నీళ్ళని తేటతల్లమయింది.ఆయన మైనింగ్ ముఠాల చేతిలో కీలుబొమ్మ అనుకుంటే పొరపాటే. భాగస్వామి అనటం సరైనదేమో. కంపెనీల యజమానులూ,పాలకులూ తోడుదొంగలని జనం నమ్ముతున్నారు.. గడచిన పదేళ్ళలో మూడు కోట్ల టన్నుల ఇనుప ఖనిజం ఎల్లలు దాటించారన్న ముఖ్యమంత్రి, విచారణకు ససేమిరా అన్నాడు. ఇంకేం, తాను 24 కారెట్ల బంగారాన్నని విలేకరులకు చెప్పాడు జనార్దనరెడ్డి. అలా కర్నాటక ప్రభుత్వాన్ని గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. బి.జె.పి వాళ్ళకి సాగిలపడక తప్పలేదు. గవర్నర్ని ధిక్కరించారు. రాజ్యాంగేతర శక్తిగా తయారయ్యారు. ఆంధ్రప్రదేశ్ లో తన వ్యాపార భాగస్తుణ్ణి గద్దెనెక్కించేందుకు కృషి చేస్తున్నాడు. అక్కడ బి.జె.పి. ఇక్కడ కాంగ్రెస్ లో ఒక ముఠా. ఇదీ వరస.ప్రజల బాగోగులు గాలికి. ఆదాయం 'గాలి'కి.

ఇండియాలో అపారఖనిజ సంపద ఉంది. 89 ఖనిజాల్ని వెలికి తీస్తుంది. 2000-2001 లో వెలికి తీసిన ఖనిజాల విలువ 56807కోట్ల రూపాయలు. 1991 లో మన్మోహన్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలూ,1993 లో రూపొందించిన జాతీయ గనుల విధనమూ  ప్రైవేట్ కంపెనీలకి బాగా ఉపయోగపడ్డాయి. ఇండియాలో 3100

గనులలో ఖనిజాలు వెలికి తీస్తున్నారు. బొగ్గు నిక్షేపాల్లో మనది ప్రపంచంలో నాలుగో స్థానం. క్రోమైట్ ఉత్పత్తిలో రెండొ స్తానం. బొగ్గు, లిగ్నైట్ లలో మూడోది. బెరైటీస్ లో, ఇనుప ఖనిజంలో నాలుగోది. బాక్సైట్ లో, ముడి స్టీల్ లో 5 వది. మాంగనీస్ లో ఏడోది. అల్యుమినియం లో ఎనిదోది. థోరియం లో 12 వ స్తానం. మైకా ఉత్పత్తిలో మనది ప్రథమ స్తానం.మొత్తం ఉత్పత్తిలో 60 శాతం మనదే. ఇదంతా ప్రజల పరం అయితే దేశం సుభిక్షమవుతుంది నిజమే. కాని దాన్నంతా ప్రైవేట్ సంస్తలకు కట్టబెట్టేందుకు కంకణం కట్టుకున్నారు ప్రధాని మన్మోహన్ సింగ్, చిదంబరం. ఒరిస్సాలోని బాక్సైట్ నిక్షేపాల విలువ 4 లక్షలకోట్ల డాలర్లని మించిఉంటుంది.మన స్తూలజాతీయోత్పత్తి 2009 లో 1 లక్షా 24 వేల కోట్ల డాలర్లు.అంటే అక్కడి బాక్సైట్ విలువ మన జి.డి.పి కి మూదింతలకి మించిపోయింది. అక్కడ సున్నపురాయి, బాక్సైటు, తగరం, అభ్రకం, కింబర్‌సైట్- హీరా డోలమైట్, ఇనుము, బొగ్గు గనులు ఉన్నాయి.
ఈ సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే బహుళజాతి సంస్థలకు విక్రయించింది. ఖనిజాలని వెలికితీసే ప్రయత్నం చెయ్యని గనులు ఎన్నో ఉన్నాయి.బ్రిటిష్ పాలకులు బలంతో దేశఖనిజాల్ని ఎత్తుకుపోయారు. ఇప్పుడు వివిధ దేశాల  కంపెనీలకి మన పాలకులే అమ్మి కాదన్న వాళ్ళని బలంతో నెట్టివేసి అన్ని గనుల్నీ బహుళజాతి కంపెనీలకి అప్పజెప్పే కార్యక్రమం చేపట్టారు. ఏ కంపెనీ అయినా ఆదివాసీల మనుగడకు, పర్యావరణానికీ చేస్తున్న హాని ఒక్కటే. వేదాంత అటవీ చట్టాలను, గిరిజనుల హక్కుల చట్టాలను ఉల్లంఘించినట్టుగా కేంద్రప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ నిర్ధారించింది.

ఆరావళీ పర్వత ప్రాంతంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనీ వాటిని నిరోధించాలనీ రాజాస్తాన్ ముఖ్యమంత్రి గెహ్లాట్ అధికారుల్ని కోరాడు. రాష్ట్ర మైనింగ్ రెవిన్యూ 1500 కోట్ల రూపాయలు.అందులో 700 కోట్లు ఆరావళీ పర్వత శ్రేణుల్లో ఉన్న 15 జిల్లాల నుంచే వస్తుంది.అధికారులు నిక్కచ్చిగా పనిచెయాలని ఆదేశించాడు. సరే. మంత్రులు, ఎం.ఎల్.ఏ లు గదా అసలు వాళ్ళు. ఎక్కువ లబ్ది పొందేవాళ్ళు. వాళ్ళ సంగతేమిటి?
బెంగాల్‌లో ప్రైవేట్ పెట్టుబడికి భూములు కట్ట బెట్టబోయి మార్క్సిస్టులు ప్రజలకి దూరమయ్యారు.
ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2005లో  70  కోట్ల రూపాయల ఒప్పందాలు చేసుకొంది. మైనింగ్ పేరుతో అటవీ భూములు భారిగా కబ్జా అవుతున్నాయని C.P.జోషి నివేదిక (2009) లో ఉంది. ఆయన అప్పటి చత్తీస్ ఘడ్ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి.
చత్తీస్ ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాలలో లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఉంది.మరొ 28 రకాల ఖనిజాలున్నాయి.రాగి, పాలరాయి,గ్రానైట్, సిలికా, బొగ్గు, డోలమైట్ లాంటివి.వీటికి సంబంధించి ఎన్నో అవగాహన ఒప్పందాలు జరిగాయి. జార్ఖండ్ లోనే వాటి సంఖ్య 90.కొండలూ, నదులూ, అడవులూ -  అన్నిటిమీదా ఒప్పందాలు ఎప్పుడో అయిపోయాయి.
ఒరిస్సాలో 600 చోట్ల గనుల తవ్వకాలు జరుగుతున్నాయి ఒరిస్సాలోని బాక్సైట్ నిక్షేపాల విలువ 4 లక్షలకోట్ల డాలర్లని మించిఉంటుంది.మన స్తూలజాతీయోత్పత్తి 2009 లో 1 లక్షా 24 వేల కోట్ల డాలర్లు.అంటే అక్కడి

బాక్సైట్ విలువ మన జి.డి.పి కి మూడింతలకి మించిపోయింది. అక్కడ సున్నపురాయి, బాక్సైటు, తగరం, అభ్రకం, కింబర్‌సైట్- హీరా డోలమైట్, ఇనుము, బొగ్గు గనులు ఉన్నాయి.

ఐ.ఎ.ఎన్.ఎస్. రిపోర్ట్ ప్రకారం జార్ఖండ్‌లో రోజుకి 106 కోట్ల రూపాయల విలువ చేసే 7515 టన్నుల బొగ్గు అక్రమ తవ్వకం జరుగుతోంది. ఆరాష్ట్రం ఆమేరకు భారీగా నష్టపోతోంది. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ఉన్న మధుకోడా ఒకప్పుడు గని కార్మికుడు.తర్వాత గనులు లీజుకి పొందాడు. ఆశాఖని గుప్పెట్లో పెట్టుకొని వేలకోట్లు దండుకున్న విషయం తెలిసిందే.

గోవాలో రాజకీయ నాయకులు అక్రమతవ్వకాలకి అండదండగా ఉన్నరని స్పీకర్ ప్రతాప్ సింగ్ రాణే చెప్పాడు. ప్రజలినీ, ప్రభుత్వాన్నీ మోసగిస్తున్నారన్నాడు. గనుల శాఖ ముఖ్యమంత్రి చేతుల్లో పెట్టుకొని కుమ్మక్కై కొల్ల గొడుతున్నాడని ప్రతిపక్షాలు గోల చేస్తున్నాయి.ఇందువల్ల ఆచిన్న రాష్ట్రం ఏటా  250 కోట్లు నష్టపోతున్నదని అంచనా.

బొగ్గు మాఫియా ముఠాలు ఏటా 1800 కోట్ల రూపాయల విలువ చేసే 60 లక్షల టన్నుల బొగ్గు దోచుకుంటున్నాయని  కేంద్ర బొగ్గుశాఖ తేల్చింది. అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు కమిటీల్ని పెట్టాలని ఆయా రాష్ట్రాలకు చెప్పింది. ఒరిస్సా, జార్ఖండ్, చత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో మాఫియా చర్యలు పెచ్చరిల్లుతున్నాయి. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి శ్రీప్రకాష్ జైశ్వాల్ ఇండియాలో 10 వేల మైనింగ్ మాఫియా గ్రూపులున్నాయని చెప్పాడు.

203 బొగ్గు బ్లాకుల్లో మైనింగ్ కార్యకలాపాల్ని పర్యావరణ మంత్రిత్వ శాఖ అభ్యంతరం వ్యక్తపరిచింది.కనక వాటిలో తవ్వకాలను నిషేధించారు. నిషేధించినందువల్ల ప్రభుత్వ ఖజానాకి నష్టం వస్తుందని ప్రధాని కార్యాలయం (పి.ఎం.ఓ) కలగజేసు కున్నది. దాని ప్రమేయం వల్ల ఇప్పుడు వాటిలో 77 బ్లాకుల్లో అనుమతివ్వాలని కమిటీ సూచించింది. ఇదంతా ప్రైవేటు కంపెనీలకి కట్ట బెట్టేందుకే.

మైనింగ్ మాఫియా కొలంబియా , ఆఫ్రికా దేశాలలో  ఖనిజ సంపదను కొల్లగొట్టి దేశాలని గుల్ల చేశాయి. కంపెనీలేమో కోటానకోట్లకు పడగలెత్తాయి. ప్రజలేమో ఆకలితో అలమటిస్తున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని కెవిన్ రడ్ ని పదవిచ్యుతుణ్ణి చేసి ఆ స్తానంలో జులియా గిలార్డ్ ని కూర్చోపెట్టారు.ఆమె కార్పొరేట్ల ప్రయోజనాల్ని కాపాడేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. లేబర్ ప్రభుత్వం మైనింగ్ పరిశ్రమ మీద రిసోర్స్ సూపర్ ప్రాఫిట్స్ టాక్స్ (ఆర్.ఎస్.పి.టి) పేరుతో 40 శాతం పన్ను ప్రతిపాదించింది. వాళ్ళ డిమాండ్లు త్వరలో తీర్చకపోతే, పన్నుతోపాటు ప్రభుత్వం మీద కూడా పోరాడతామని మైనింగ్ మారాజులు జులియాకి తుదిహెచ్చరిక చేశారు.ఇప్పడీమె దాన్ని గణనీయంగా తగ్గించే కార్యక్రమంలో ఉంది.బడ్జెట్ లోటు తగ్గించేందుకని ప్రభుత్వ వ్యయాన్ని  కుదించబోతోంది. స్వేచ్ఛా వాణిజ్య సంస్కరణల్ని వేగవంతం చేయ బోతోంది. కెవిన్‌ని దించటంలో మైనింగ్ కంపెనీల పాత్రే ప్రధనమైంది. మైనింగ్ టైకూన్స్ కెవిన్ ని దించిన ఘనతలో ఎక్కువ పాలు తమదే నని చెప్పుకున్నారు. రిసోర్స్ టాక్స్ పట్ల పరిశ్రమల వ్యతిరేకతే తిరుగుబాటుకి ప్రధాన కారణమని చెప్పారు  అని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ పత్రిక రాసింది. రెండు నెలల పాటు ఆందోళనలు

చేశారు. చెయ్యని అకృత్యాలు లేవు. మీడియాని మేపారు. సంక్షోభం వస్తుందనీ, ఉద్యోగాలు భారీ సంఖ్యలో పోతాయని ప్రజల్ని భయభ్రాంతులకి గురిచేశారు.
కెవిన్ తనపార్టీలో మద్దతు కోల్పోయాడు. 24 జూన్‌న నాయక త్వాన్నుంచి తప్పుకోవలసి వచ్చింది. డెప్యూటీ ప్రధాని జూలియా పీఠమెక్కించారు. ఎక్కగానే విధానాన్ని మార్చివేసింది. రాబోయే రెండేళ్ళలో ఆర్.ఎస్.పి.టి వల్ల 12000 కోట్ల డాలర్లొచ్చి ఉండేవి.కొత్త విధానంలో 4500 కోట్లు మాత్రమే వస్తాయి. అంటే 7500 కోట్లు తగ్గుతాయి.ఈమొత్తం జులియా ని గద్దెనెకించినందుకు కంపెన్లకి నజరానా. కొత్త పాలకులు 40 శాతం నుంచీ 22.5 శాతానికి తగ్గించారు.అదికూడా పెట్టుబడి మీద ఆదాయం 13 శాతం దాటితేనే వరిస్తుంది. అంతకుముందు 6 శాతం దాటితేనే చెల్లించాలి.కొత్త రేట్ల వల్ల 320 కంపెనీలు మాత్రమే ఈపన్ను కడతాయి. కెవిన్ రడ్ విధానంలో 2500 కంపెనీలు ఈపన్ను పరిధిలోకి వచ్చి ఉండేవి.
ఆధునిక యుద్ధాల్లో అల్యూమినియం భారిస్తాయిలో ఖర్చవుతుంది.20 శాతం ఎక్కువ సేకరించాలని అమెరికా పెంటగాన్ లక్ష్యంగ పెట్టుకుంది. ఇదంత వెనకబడిన దేశాలనుంచి రావలసిందే. అల్యూమినియం కంపెనీ ఆఫ్ అమెరికా 40 దేశాల్లో బాక్సైట్ నుంచి దీన్ని తీస్తుంది. ఆదేశాల జాబితాలో ఇండియా కూడా ఉంది.దీన్ని యూరప్, అమెరికల యుద్ధపరిశ్రమలకి పంపుతున్నారు

ఆఫ్ఘనిస్తాన్ లోఇప్పటి కింకా తాకని ఖనిజ నిల్వలు 1 లక్ష కోట్ల డాలర్లు చేస్తాయని అమెరికా తెలుసుకుంది. ఇంతకుముందు అనుకున్నదానికన్నా ఇది చాలా ఎక్కువ.లిథియం బాగా దొరుకుతుంది.దీన్ని లాప్‌టాప్ , బ్లాక్‌బెర్రీ ల బాటరీల్లో వాడతారు. ఇకడ దిమ్మరపోయే టంత ఖనిజం నిక్షిప్తమయి ఉంది అన్నాడొక ఆఫీసర్. ఆదేశ జి.డి.పి 1200 కోట్ల డాలర్లు మాత్రమే.ఇక ఆదేశ ఎకానమీకి వెన్నెముక అవుతుంది అని గనుల మంత్రిత్వ శాఖ సలహాదారు జలీల్ అన్నాడు. రష్యా 1980 లలో ఆఫ్ఘనిస్తాన్‌ని ఆక్రమించినప్పుడు దీని సమాచారం సేకరించింది. విరివిగా లభించేవి ఇనుమూ,రాగీ. ఘజని జిల్లాలో భారీగా ఉన్నాయి. బొలీవియాలో అన్ని దేశాలకన్నా ఎకువ లిథియం నిల్వలున్నాయి. బొలీవియా లో ఉన్నన్ని నిల్వలు అఫ్ఘనిస్తాన్ లో ఉన్నాయి. ఒబామా వాటిని కొల్లగొట్టకుండా విశ్రమిస్తాడా? తమకు అప్పగించేంతవరకూ బహుళజాతి కంపెనీలు నిద్రపోనిస్తాయా?

అమెరికా కెనడాలు మానవ హక్కుల గురించి మట్లాడుతూ వాటిని హరించటలో ముందుంటాయి.గోల్డ్ కార్ప్ అనే కెనడా బహుళజాతి సంస్థ Valle de Siria(హొండురాస్ లో ఒక ప్రాంతం) లో సహజ వనరుల్ని నాశనం చేసింది. మొత్తం జనాభా 42 వేలమందిలో నూటికి 80 మంది ఆరోగ్యం కోల్పోయారు.మైనింగ్ చర్యల వల్ల తాగునీటిలో ఆర్సెనిక్, సీసం, పాదరసం లాంటి లోహాలు కలిసి కలుషితమై పోయింది. కార్పొరే ట్లకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకునేందుకు అధికారులకీ, నాయకులకీ లంచాలు ఇస్తున్నారు.హొండురాస్‌లో 2009 లో జరిగిన సైనిక తిరుబాటు వెనక కెనడా పెట్టుబడి ఉంది. గనుల సంస్థల పాత్ర పెద్దదని వేరే చెప్పక్కర్లేదు.

కొలంబియా వెలికితీత పరిశ్రమల్లో ఉన్న బహుళజాతి పెట్టుబడి ఆదేశంలో అంతర్యుద్ధాన్ని స్థిరపరుస్తోంది. పౌరులమీద మిలిటరీ భీభత్సాన్నీ ఉధృతం చేస్తోంది.1990 దశకంలో నయాఉదారవాద పునర్వ్యవస్తీకరణ నేపథ్యంలో ఈప్రక్రియ జరుగుతోంది. సంపద కేంద్రీకరణ ముమ్మరమయింది.రైతులు పొలాలు వదిలి పారి పోవలసి వస్తోంది.21 వ శతాబ్దంలో కొలంబియా పెట్టుబడిదారీ విధానాన్ని అర్ధం చేసుకోటానికి మార్క్స్ చెప్పిన ఆదిమ సంచయనం అనే భావన తగిన పరికరం. కొలంబియాలో ఈ పదేళ్ళలో దాదాపు 30 లక్షలమంది నిర్వాసితులయినారు. వీళ్ళలో 20 లక్షలమంది గనులప్రాంతాలనుంచి గెంటబడ్డవారే. అక్కడి హింస ఊహకందదు. వ్యతిరేకంగా పనిచేసినవాళ్ళని చాలామందిని బెదిరించారు.చంపివేశారు. మానవ హక్కుల్ని ఉల్లఘించి ప్రవర్తించారు. పేదరికాన్ని పెద్ద స్థాయికి పెంచారు.

బయ్యారం వ్యవహారం మీద విచారణ అవసరం లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది.ఓబులాపురం అక్రమ మైనింగ్ గురించిసి.బి.ఐ విచారణకు యెడ్యూరప్ప ససేమిరా ఒప్పుకోవటం లేదు.పాలకులు కెంపెనీలని ఎలా కంటికి రెప్పలా కాపాడుతున్నాయో బయట పడుతున్నది.

కర్ణాటకలో గాలి సోదరులని రక్షణకల్పిస్తూ, ఖమ్మంలో రక్షణ స్టీల్స్ ని తప్పుపట్టటం - ఇంతకన్న నీతిమలిన పని ఉంటుందా! ఒరిస్సాలో అక్రమ మైనింగ్ మీద రాహుల్ గాంధీ తీవ్రంగా మాట్లాడాడు.ఆప్రభుత్వం పర్యావరణ నిబంధనల్ని పాటించటం లేదని విమర్శించాడు.అక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షం కనక అధికార బి.జె.పి ముఖ్యమంత్రిని రాజీనామా చెయ్యమంటున్నది. కాని రక్షణ స్టీల్స్ విషయంలో యాజమాన్యం కొమ్ము కాస్తున్నది. సొంత పార్టీ వాళ్ళయితే ఒకె. ఇతర పార్టీల వాళ్ళయితే తప్పు. అధికార ప్రతిపక్ష పార్టీ లన్నీ ఒకేరకమైన ఎత్తుగడలతో ముందుకు పోతున్నాయి. అంతమాత్రాన నాయకుల్ని కంపెనీల చేతుల్లో కీలుబొమ్మలు అనటం కుదరదు. భాగస్వాములనవచ్చు. వాళ్ళూ వీళ్ళూ తోడు దొంగలనవచ్చు. ఈ సత్యం ఇవ్వాళ అందరికీ తెలిసిపోయింది.జనం వీళ్ళని నమ్మటం లేదు. అందుకే ధరల పెరుగుదలకి వ్యతిరేకంగా ఉద్యమమన్నా నమ్మి వీళ్ళ వెంట స్వచ్చందంగా వచ్చే జనం కరువయ్యారు.

గనుల్ని కట్టబెట్టింది ఎవరికి అనేది ప్రజలకి అప్రస్తుతం.ఎవరికైనా ఒకటే. అసలెవ్వరికీ ఇవ్వకూడదు. ప్రభుత్వం దగ్గరే ఉండాలి. కాని పార్టీలకి అలా కాదు. బి.జె.పి కి ఓబుళాపురంలో గనులివ్వటం కరెక్టు.బయ్యారం గనులివ్వటం కుంభకోణం. ఇక్కడ ప్రతిపక్షాలకి అప్పటి ముఖ్యమంత్రి బంధువులకి ఇవ్వటం తప్పు. అంతేగాని అసలివ్వద్దనే ప్రజలతో ఎవ్వరూ ఏకీభవించరు. మార్క్సిస్టులకేమో బెంగాల్లో వాళ్ళిస్తే రైటే. ఇతర రాష్ట్రాల్లో ఇతర పార్టీలవాళ్ళిస్తే నేరం. వాస్తవానికి ఇండియాలో కేంద్ర ప్రభుత్వమూ,అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ అదే పనిలో నిమగ్నమై ఉన్నాయి.

అటవీ ప్రాంతాల్లో నివసించే 9 కోట్లమంది గిరిజనుల్లో 1991 కి ముందే గనుల తవ్వకాల వల్ల రెండున్నర కోట్లమంది బయటకు పోవలసి వచ్చింది.ఇప్పుడు చాలామందికి అదే పని చేయక తప్పటం లేదు.

ప్రైవేటీకరణ,సరళీకరణ, ప్రపంచీకరణ ల వైపు అన్ని దేశాలూ ఉరుకులెత్తుతున్నాయి. చైనా ఇండియాలు ముందు వరసలో ఉన్నాయి.సంస్కరణ స్మరణ మన్మోహన్ సింగ్‌కి ప్రాణం. అన్ని ప్రైవేటికరించాలని చూస్తుంటే

ప్రైవేట్ పరమయిన గనుల్ని తిరిగి ప్రభుత్వం ప్రజలపరం చేస్తుందా? గనుల్ని అప్పగిస్తామని ఎన్నో ఒప్పందాలు చేసుకున్నాయి ప్రభుత్వాలు.వాటిని స్వాధీనం చెసేందుకు ఎంతకయినా సిద్ధమవుతున్నారు. వద్దనే వాళ్ళతో తలపడుతున్నారు. ఏమైనాసరే వాటిని ఇచ్చెయ్యటనికే కంకణం కట్టుకున్నారు. 2004 లో ఆర్ధిక మంత్రిగా ప్రమాణం చేశే దాకా 'వేదాంత' సంస్తకు నాన్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ గా ఉన్న చిదంబరం, మంత్రి అయిన వెంటనే ఆకంపెనీకి అనుకూలంగా సంతకలు పెట్టిన చిదంబరం,హోం పగ్గాలు పట్టాక ఏమి చేసయినా గనులు అప్పగించాలని పట్టుదలతో ఉన్న చిదంబరం అనుసరిస్తున్న విధానాన్ని మన మాజీ మంత్రివర్యులు ఇదేమాదిరి విమర్శిస్తారా? అక్కడి ఆదివాసీలను బయటకు పంపించేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలను ఆపమని అనగలరా?

మార్క్స్ కాపిటల్ మొదటి సంపుటిలో 8 వ విభాగం 'ఆదిమ సంచయనం' చదివితే ఇప్పడు జరుగున్నది పూర్తిగా తెలుస్తుంది. ఆనాడు హింస, మోసం, దౌర్జన్యం ప్ర యోగించి రైతుల్నీ,వృత్తిదారుల్నీ నిరాశ్రయుల్ని చేసి పెట్టుబడికి కట్టబెట్టాయి ప్రభుత్వాలు. అలాటి కార్యక్రమాన్నే ఇప్పడు చేపట్టాయి. అంతకన్నా భారీస్తాయిలో చేస్తున్నాయి. 1970 దశకం మధ్య నయాఉదారవాదం నడుస్తు న్న నాటినుంచి ఈప్రక్రియ వేగం పుంజుకున్నది.

అప్పట్లో ఫాక్టరీల్లో పనిచేసేందుకు కూలీల కొరత బాగా ఉంది. కనక పొలాలు కోల్పోయిన వాళ్ళకి, వృత్తులు పోయిన వాళ్ళకీ కూలిపనులు దొరికాయి. ఇవ్వాళ ఆపరిస్తితి లేదు. ఎక్కడ చూచినా నిరుద్యోగులే.వీళ్ళకి పనులు దొరకటం కష్టం. అందరికీ అయితే దొరికే ప్రశ్న లేదు. పేదరికంలో కూరుకుపోవలసిందే. అభివృద్ధి లాబీ అబద్ధాలు చెబుతుంది .మైనింగ్ వల్ల ఎన్నొ ఉద్యోగాలొస్తాని చెబుతారు. అంతా ఉత్తదే.చాలాకొద్ది మందికే వస్తాయి. అవికూడా కీతా జీతాల వాచ్‌మన్ పనుల లాంటివే.దేశ ఆదాయం పెరుగుతుందంటారు. నిజానికి ప్రభుత్వానికి 10 శాతం అయినా దక్కదు. భారీభాగం యజమానులకే పోతుంది.

చంద్రుడి మీద హీలియం 3 లభిస్తుంది. ఇది భూమిలో  దాదాపు దొరకదు.ఇది ఫ్యూజన్ రియాక్టర్లకి మంచి ఇంధనం. 2007 తర్వాత చంద్ర మండలం వైపు పయనంలో పోటీ పడుతున్న దేశాలు పెరిగాయి.1960 దశకంలో అమెరికా రష్యాల మధ్యే పోటీ ఉంటే, ఇప్పడు ఇండియా చైనా లతో సహ మరికొన్ని దేశాలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.చైనా 2011 కల్లా మనిషిలేని వాహనాన్ని అక్కడ దింపుతానంది.మాజీ రాష్ట్రపతి కలాం, ప్రధాని మన్మోహన్ సింగ్ ఇద్దరూ చందమామ నుంచి హీలియం3 భూమికి తెస్తామన్నారు.అదేసమయంలో జపాన్ జర్మనీలూ రెడిగా ఉన్నట్లు చెప్పాయి. ఫ్యూజన్ ద్వారా విద్యుదుత్పత్తి చేసే కేంద్రాలు ప్రస్తుతం డ్యుటీరియం, ట్రిటియం వలయాన్ని అభివృద్ధి చేస్తున్నాయి ఈ ప్రయత్నంలో కొన్ని సమస్యలున్నాయి. హీలియం 3 వాడితే సమస్యలుండవని శాస్త్రవేత్తల అభిప్రాయం. అందుకని చంద్ర

మండలాన్ని అక్రమించి గనులు స్వాధీనం చేసుకోవలని ఆరాట పడుతున్నారు. అందుకోసం పోటీ పెరుగుతున్నది.

చంద్రమండలంలో గనులు లభిస్తే లాభించేది మైనింగ్ మాఫియాలూ, అధికారపార్టిల నాయకులూ. దేశాలకు ఆదాయం రానివ్వరు. అంతేకాదు, అక్కడ జరగబోయేదీ అక్రమ మైనింగే.